ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

బుధవారం 24 జూలై 2024



తమిళ పదమే లేని కేంద్ర బడ్జెట్

● కేంద్ర బడ్జెట్‌ను తప్పుబట్టిన వివిధ పార్టీలు

రాష్ట్రానికి మొండిచెయ్యి!

ఉత్తచేతులతోనే సరిపుచ్చిన నిర్మలమ్మ

● కొత్త పథకం ఇల్లై.. నిధులూ ఇల్లై

● తమిళనాడుపై ఇంత వివక్షా?

● నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తాం

నిప్పులు చెరిగిన సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి మొండి చేయి చూపారు. రాష్ట్రంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడం, తమిళ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఎనలేని ఆసక్తి ప్రదర్శిస్తుండడంతో మోదీ '3.0' ప్రభుత్వం రాష్ట్రానికి పుష్కలం గా కాసులు రాలుస్తుందన్న అన్ని వర్గాల అంచనాలు పటాపంచలు చేస్తూ నిర్మలమ్మ ఉత్తచేతులూపారు. రాష్ట్రానికి కొత్త పథకం గానీ, ప్రత్యేక కేటాయింపులు గానీ లేకుండా బడ్జెట్ ముగించేశారు. బడ్జెట్ మొత్తమ్మీద అసలు తమిళనాడు అనే పదమే లేకుండా కానిచ్చేశారు. సాధారణంగా గతంలో నిర్మలా సీతారామన్ బడ్జెట్ దాఖలుకు ముందు 'తిరుక్కురళ్' సూక్తులు వల్లెవేశాకే ప్రసంగాన్ని ప్రారంభించేవారు. కానీ ఆమె ప్రసంగం ఈసారి ఇందుకు భిన్నంగా సాగింది. తిరుక్కురళ్ సంగతి దేవుడెరుగు.. బడ్జెట్లో అసలు తమిళనాడు ప్రస్తావనే లేకుండాపోయింది. రాజధాని నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చెన్నై మెట్రోరైలు రెండో విడత పథకానికి సంబంధించి నిధులు, తాంబరం-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ హైవే పథకం, మదురై, కోయంబత్తూర్ నగరాల్లో మెట్రోరైలు పథకం వంటి అంశాలేవీ నిర్మలమ్మ బడ్జెట్లో కానరాకపోవడం రాష్ట్ర వాసుల్ని నిరాశకు గురి చేసింది. ఇక పెండింగ్‌లో వున్న పలు జాతీయ రహదారులకు టానీ, రైల్వే ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించకపోవడం శోచనీయం. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు, వివిధ పార్టీల నేతలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వివరాలిలా వున్నాయి...

తమిళనాడుపై ఇంత వివక్షా?: సీఎం ఆగ్రహం

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అన్ని రాష్ట్రాల సమగ్రాభివృద్ధిని కాంక్షించే విధానంగా ఉండాలని, అయితే పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమిళనాడుకు సంబంధించిన పథకాల ప్రస్తావనే లేకపోవడం గర్హనీయమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన కేంద్రప్రభుత్వం ఇంతటి వివక్ష ప్రదర్శించడం ఏమాత్రం సరి కాదని ఆయన హితవు పలికారు. మంగళవారం సాయంత్రం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయంలో తన మంత్రి వర్గ సహచరులతో కలిసి మీడియాతో మాట్లాడిన స్టాలిన్ కేంద్రం వైఖరిని తప్పుబట్టారు. తమకు మద్దతిచ్చే పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మెండుగా నిధులు, పథకాలను కేటాయించి, ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మొండి చేయి చూపడం బీజేపీ పాలకుల దురుద్దేశాన్ని బట్టబయలుచేస్తోందన్నారు. మతతత్త్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందుకే బీజేపీ పాలకులు తమిళులపై కక్ష తీర్చుకుంటున్నారని, దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తమిళనాడుకు నిధులు కేటాయించకపోవడం దుష్ట సంప్రదాయమని విరుచుకుపడ్డారు. ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని ముక్కచెక్కలు చేసేలా ఈ బడ్జెట్ ప్రతిపాదనలున్నాయని విమర్శించారు. ఈ సంవత్సరం మొదట్లో తుపానులు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి రూ.37వేల కోట్ల వరద సహాయం కావాలని కోరితే కేంద్రం రూ.276 కోట్లు మాత్రమే విదిల్చిందన్నారు. రెండో విడత మెట్రో రైల్వే ప్రాజెక్టుకు యేళ్ల తరబడి నిధులు విడుదల చేయకుండా బీజేపీ ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని, కోవై, మదురైలో మెట్రోరైలు ప్రాజెక్టులు ప్రారంభించే ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేవన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికంటూ ఎలాంటి రైల్వే, రహదారుల అభివృద్ధి పథకాలు గానీ ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంశాలను పోలి వున్నాయన్నారు. వెయ్యి పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్, కార్మికులకు వసతి గృహాల ఏర్పాటు వంటివి తమ పథకాలకు కాపీయేనన్నారు. నిర్మలా సీతారామన్ తమిళనాట అమలవుతున్న పథకాలను కాపీ కొట్టిన కృతజ్ఞతాభావంతోనైనా రాష్ట్రానికి ఓ మంచి పథకం ప్రకటించకపోవడం గర్హనీయమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర జాబితాలో ఉన్న రిజిస్ట్రేషన్ రుసుములు తగ్గించాలని ప్రకటించిన కేంద్రప్రభుత్వం.. దాని వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేసే ప్రతిపాదనలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఆదాయపు పన్ను పరిమితి కాసింత పెంచటం మినహా మధ్యతరగతి ప్రజలకు ఈ బడ్జెట్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపిన బీజేపీ ప్రభుత్వ తీరును నిరశిస్తూ ఈ నెల 27న జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్రంలో ఇండియా కూటమిని గెలిపించడం వల్లే తమిళనాడు ప్రజలపై కేంద్ర పాలకులు కక్ష కట్టారన్నారు. కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా డీఎంకే, మిత్రపక్షాల ఎంపీలు బుధవారం ఢిల్లీలో ధర్నా చేపడతారని స్టాలిన్ ప్రకటించారు.

నిరాశ కలిగించింది
అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్

దేశ ఆర్థికాభివృద్ధిని సమతూకంగా తీసుకెళ్లే పథకాలు కేంద్ర బడ్జెట్‌లో కరువయ్యాయి. ముఖ్యంగా, రాష్ట్రానికి ఎలాంటి పథకాలు, ప్రాజెక్టులు ప్రకటించకపోవడం తమిళనాడుపై కేంద్ర ప్రభుత్వానికున్న పక్షపాత వైఖరిని సూచిస్తోంది. అధికార పార్టీకి 39 మంది ఎంపీలున్నా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, పథకాలు తీసుకురాకపోవడం నిరాశ కలిగించింది.

బడ్జెట్‌లో 'తమిళనాడు' పదమే లేదు
టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నివేదిక తిరోగమనంగా ఉంది. అభివృద్ధికి అవకాశం లేని, ఉపాధి అవకాశాలు పెంచని, ఆర్థిక అసమానతలు రూపుమాపని బడ్జెట్ ఇది. తమిళనాడుకు ప్రత్యేక పథకాలు, నిధులు కేటాయించక పోగా, బడ్జెట్‌లో కనీసం 'తమిళనాడు' అనే పదం కూడా లేకపోవడం శోచనీయం. 'ఇండియా' కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరు ఖండించదగినది.

మిత్రపక్షాలను తృప్తిపరిచే బడ్జెట్
ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

మైనార్టీ ప్రభుత్వాన్ని మెజార్టీలోకి తీసుకొచ్చిన మిత్రపక్షాలను తృప్తిపరిచే బడ్జెట్ ఇది. అస్సాం, ఉత్తరాఖండ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సంభవించిన వరద నష్టాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు గానీ, వరదలతో అతలాకుతలమైన తమిళనాడుకు ఎలాంటి నిధులు అందించలేదు. బీహార్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు ప్రత్యేక పథకాలకు నిధులు కేటాయించి, తమిళనాడుకు మొండిచేయి చూపారు.

సామాన్యులకు మోసం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

బీహార్, ఆంధ్ర రాష్ట్రాల్లోని అధికార పార్టీలను మంచి చేసుకునేందుకు త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల ఓటర్లను ఆకర్షించేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. ఎప్పటిలాగే బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడుతున్న కార్పొరేట్లు, బడా వ్యాపార వర్గాలకు దోహదపడేలా వుంది. మూడో సారి అధికారం చేపట్టేందుకు ఓట్లేసిన సామాన్య ప్రజలను మాత్రం ఈ బడ్జెట్ మోసం చేసింది.

నిరాశ కలిగించింది
పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్

పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక నివేదికలో పొదుపును ప్రోత్సహించేందుకు పాత ఆదాయపు పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవడం, తమిళనాడు అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ప్రకటించకపోవడం నిరాశ కలిగించింది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుపై ఎలాంటి ప్రకటన లేకపోవడం శోచనీయం.

దేశ భవిష్యత్తు వృద్ధిని నిర్ధారించే బడ్జెట్
టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలు, కేటాయించిన నిధులతో రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యంతో పాటు వివిధ రంగాలు మెరుగుపడతాయి. మహిళల ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పించే బడ్జెట్ ఇది. కొత్త ఆదాయపు పన్ను విధానం చాలా ప్రయోజనకరం.

దేశపురోగాభివృద్ధికి దోహదం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ పురోగాభివృద్ధికి దోహదపడేలా ఉంది. రానున్న 25 ఏళ్లలో నవ భారత దేశంగా అభివృద్ధి చెంది విద్య, వ్యవ సాయం, మౌలిక వసతులు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఈ బడ్జెట్ ఎంతగానో దోహదపడుతుంది.

కేంద్ర బడ్జెట్ తయారీలో ఇద్దరు తమిళ అధికారుల కీలక పాత్ర

అడయార్, జూలై 23: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ఈ బడ్జెట్ రూపకల్పనలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు కీలక పాత్ర పోషించారు. వీరిలో ఒకరు టీవీ సోమనాథన్. రెండో అధికారి వి.ఆనంద్ నాగేశ్వరన్. వీరిద్దరితో పాటు కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారుల బృందం కూడా ఉంది. ఇదంతా ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ నార్త్ బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో అత్యంత రహస్యంగా జరిగింది. టీవీ సోమనాథన్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2015 ఏప్రిల్ నుంచి 2017 ఆగస్టు వరకు ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడు. ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందిన ఈయన 2020లో కేంద్ర ఆర్థిక శాఖలో కార్యదర్శిగా చేరారు. అప్పటి నుంచి ఆయన బడ్జెట్ తయారీ బృందంలో సభ్యుడిగా ఉన్నారు. అలాగే, వి.ఆనంద్ నాగేశ్వరన్... కేంద్ర ఆర్థిక శాఖకు ప్రధాన సలహాదారుడిగా ఉన్నారు. ముఖ్యంగా అనేక ఆర్థిక అంశాలపై కేంద్ర విత్తమంత్రికి కీలక సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. ఐఐఎం అహ్మదాబాద్‌లో ఎంబీఏ పూర్తి చేసిన ఈయన ఆర్థిక శాస్త్రంపై మంచి పట్టున్న నిపుణుడిగా గుర్తింపుపొందారు. దీంతో బడ్జెట్ రూపకల్పనలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. బడ్జెట్ రూపకల్పనలో ముఖ్యభూమిక పోషించిన వారిలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఐఏఎస్‌లున్నా.. రాష్ట్రానికి మాత్రం ఒరిగిందేమీ లేదని రాజకీయవర్గాలు పెదవి విరుస్తున్నాయి.

రాజకీయాల కంటే పోలీస్ ఉద్యోగమే మంచిది

● పాలిటిక్స్‌లో కొనసాగాలా? వద్దా? అనే ఆలోచన వస్తోంది

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నిర్వేదం



అడయార్, జూలై 23: రాజకీయాల కంటే పోలీస్ ఉద్యోగమే మేలనిపిస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాల్లో కొనసాగాలా? వద్దా? అనే ఆలోచన కూడా వస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేసిన అనుచరులు, సన్నిహితులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన తన మనసులోని మాట చెప్పినట్లు తెలిసింది. గత మూడేళ్ళుగా రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ అనేక విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. "రాజకీయ నేతగా ఇది నాకెంతో కష్టకాలం. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి ఈ కుర్చీలో వున్నాను. ఇలాంటి రాజకీయాల్లో మనం కొనసాగాలా? వద్దా? అనే ఆలోచన చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాజకీయాల కంటే పోలీసు ఉద్యోగమే ఎంతో సులభం. పోలీస్ శాఖలో బ్లాక్ అండ్ వైట్ అనే రెండు మాత్రమే ఉంటాయి. ఒక నిందితుడు తప్పు చేశాడా లేదా? అన్నదే ముఖ్యం. ఈ విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. కానీ, రాజకీయాల్లో కొనసాగాలంటే అనేక విషయాల్లో రాజీ పడాల్సి వుంది. ఇక్కడ సాధారణ వ్యక్తిగా మాట్లాడేందుకు వీలుండదు. సొంత పార్టీ నేతలే అనవసర ఆరోపణలు... త్యాలు చెప్పినా వాటిని భరించాల్సిన దుస్థితి. రాజకీయాల్లో విజయం సాధించాలంటే ఎంతగానో శ్రమించాల్సి వుంది. ప్రజాస్వామ్యంలో అనేక సందర్భాల్లో నిర్వేదం ఆవహిస్తోంది. కొన్నిమార్లు నా వ్యవహారశైలి కూడా మీతో పాటు అనేక మందికి ఆగ్రహం కలిగించి వుంటుంది. అన్ని వేళల్లో కత్తి పట్టుకుని ముందుకు వెళ్లలేం. కొన్ని సందర్భాల్లో వెనకడుగు వేయాల్సి ఉంటుంది. ఎల్లవేళలా టాప్‌గేర్‌లో డ్రైవింగ్ చేస్తే గేర్ బాక్స్ చెడిపోతుంది. ఫాస్ట్ గేర్‌లో వెళితే కారు మరమ్మతులకు గురవుతుంది. అవసరమైన సమయంలో అవసరమైన గేర్‌లో డ్రైవింగ్ చేయాలి. 2026 ఎన్నికలకు మనమంతా ఐదో గేర్‌లో ప్రయాణించాల్సి ఉంటుంది. కోయంబత్తూరులో నాకు విజయం కాస్త దూరమైందంతే. అక్కడ 4.5 లక్షల ఓట్లు పొందడం గొప్ప విషయం. రాజకీయాల్లో ఉన్నపుడు సమస్యలు రావడం సహజమే. మంచి వారికే కష్టాలు ఎదురవుతాయి. నేను తప్పు చేసినా ధైర్యంగా ప్రశ్నించండి" అంటూ అన్నామలై సూచించినట్లు తెలిసింది.

దుకాణాలకు తమిళంలో నేమ్ బోర్డులు

వ్యాపారులకు సీఎం స్టాలిన్ ఆదేశం



వ్యాపారుల సంక్షేమ బోర్డు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని దుకాణాల వద్ద తమిళంలో 'నేమ్ బోర్డులు' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాపారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర వ్యాపారుల సంక్షేమ బోర్డు కార్యనిర్వాహక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సీఎం మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వ్యాపారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారని, అప్పట్లో 20 మంది అసంఘటిత వ్యాపారులు మాత్రమే సభ్యులుగా ఉండేవారని తెలిపారు. గత యేడాది జూలై 7వ తేదీ తమ ప్రభుత్వం సభ్యుల సంఖ్యను 30కి పెంచిందని చెప్పారు. ఈ బోర్డును ప్రారంభించినప్పుడు రూ.2 కోట్ల మేర నిధులుండేవని, ప్రస్తుతం రూ.4.05 కోట్లకు పెరిగాయన్నారు. మూడేళ్ల క్రితం డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఈ బోర్డులో మూడు నెలల్లోగా సభ్యత్వం పొందేవారికి రుసుము మినహాయిస్తామని ప్రకటించినట్లు గుర్తు చేశారు. దీంతో బోర్డులో సభ్యుల సంఖ్య 40 వేలకు పైగా పెరిగిందన్నారు. ఈ బోర్డు ద్వారా సభ్యుల పిల్లలకు విద్యా సాయం కింద ప్రతియేటా రూ.5వేలు, సాంకేతిక విద్య చదివేవారికైతే రూ.10 వేల చొప్పున అందజేశామని, దీంతో 94 మంది విద్యార్థులు లబ్ది పొందినట్లు తెలిపారు. బోర్డు సభ్యులకు ఇచ్చే వివాహ ఆర్థిక సహాయాన్ని రూ.5 వేల నుండి రూ.10వేలకు పెంచినట్లు చెప్పారు. బోర్డు సభ్యులు మృతిచెందితే వారి కుటుంబీకులకు ఇచ్చే సాయాన్ని రూ.లక్ష నుండి రూ.3 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఈ బోర్డు ద్వారా 9వేల మందికి పైగా వ్యాపారులు లబ్ది పొందారని, రూ. 3.29 కోట్ల మేర ఆర్థిక సహాయాలు అందజేశామని వివరించారు. వీధుల్లో తమిళ భాష కనిపించడం లేదనే విమర్శలకు తావు లేకుండా వ్యాపారులు తమ దుకాణాల వద్ద తమిళంలో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిగా కాకుండా వ్యాపారుల శ్రేయోభిలాషిగా ఆదేశిస్తున్నట్లు స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి మూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ జగన్నాథన్, ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి కృష్ణానున్ని, తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి జిల్లాలో విధ్వంసం

● కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

● పెనుగాలులకు పైకెగిరిన ఇళ్ల పైకప్పులు



కున్నూరు రహదారిలో కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గత రెండు రోజులుగా వీచిన పెనుగాలులకు విద్యుత్‌స్తంభాలు, చెట్లు కూలిపడ్డాయి. ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాలో గతపది రోజులుగా పెనుగాలులతో భారీ వర్షాలు కురవటంతో జనజీవనం స్తంభించింది. రెండు రోజులుగా వర్షం తగ్గుముఖం పట్టినా, బలంగా వీచే పెనుగాలులకు పలు చోట్ల చెట్లు కూలిపడ్డాయి. ఇళ్ళ పైకప్పులు ధ్వంసమయ్యాయి. రహదారులపై మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. దీంతో ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఉదయం కూడా జిల్లాలో పలు చోట్ల పెనుగాలులు వీయడంతో ఊటి సమీపం కోయిల్‌మేడు ప్రాంతం వద్ద ఇళ్ల పైకప్పులు ఎగురుకుంటూ వెళ్లి రోడ్లపై పడ్డాయి. 40కి పైగా ఇళ్ల పైకప్పులు పెనుగాలులకు ధ్వంసమయ్యాయి. కున్నూరు పరిసర ప్రాంతాల్లో కోల్‌కంబై, సేలర్స్ కోట్టేరి, కైకాట్టి, వండిసోలై, భారత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఆరుగంటల నుండే గాలులు వీచాయి. దీంతో పలు చోట్ల ఇళ్ళ ప్రహరీగోడలు కూలాయి. కామరాజపురం ప్రాంతంలో నగర పంచాయతీ పేదలకు మంజూరు చేసిన ఇళ్ళ పైకప్పులు పెనుగాలికి ఎగిరి దూరంగా పడ్డాయి. కున్నూరు చుట్టుపక్కల ప్రాంతల్లో 20కి పైగా ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. ఉపదలై, మేల్‌భారత్‌నగర్, సప్లయ్‌డిపో, పాత అరువంగాడు సహా 30 ప్రాంతాల్లో పెనుగాలులకు వృక్షాలు కూలాయి. ఆ ప్రాంతాలను కున్నూరు తహసీల్దార్ కని సుందరం ఇతర అధికారులు పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్ళి చెట్లను తొలగించారు. చిన్నవండి సోలై ప్రాంతంలో మూడు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది ఐదు గంటలపాటు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాత్తాడిమట్టం సమీపంలో ఓ మహావృక్షం వేళ్లతో పెకలించుకుని పడింది. దీంతో ఆ వృక్షం దిగువనున్న గుడిసె ధ్వంసమైంది. ఇక కున్నూరు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్లు కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కున్నూరు కోత్తగిరి ప్రాంతాల్లో పెనుగాలులకు పూలమొక్కలు తదితరాలు ధ్వంసమయ్యాయి. కోత్తగిరిలో ఇటీవల నిర్మించిన ప్రభుత్వ రవాణా సంస్థ డిపో పైకప్పులు కూడా పెనుగాలులకు ధ్వంసమయ్యాయి. గత రెండు రోజులుగా పెనుగాలులకు నీలగిరి జిల్లా అంతటా 90కి పైగా చెట్లు కూలిపడ్డాయని అధికారులు తెలిపారు. ఇదే విధంగా సుమారు 60 ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయని, ఊటీ, కున్నూరు, కొత్తగిరి ప్రాంతంల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నేలకొరిగాయని తెలిపారు. ఊటీ, కున్నూరు, మంజూరు, కోత్తగిరి, గూడుల, పందలూరు ప్రాంతాల్లో 150కి పైగా విద్యుత్‌స్తంభాలు కూలిపడ్డాయని చెప్పారు. మంగళవారం ఉదయం మధ్యాహ్నం నీలగిరి జిల్లా అంతటా పెనుగాలులు వీస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



కోత్తగిరి వద్ద కూలిపడిన ఇంటి పైకప్పు



కోయిల్‌మేడు వద్ద కూకటివేళ్లతో కూలినవృక్షం

సమాచార దర్శిని

27న ఫీనిక్స్ సిటీలో రజత్ చౌహాన్ కార్యక్రమం

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో వున్న ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ఈ నెల 27వ తేదీన సాయంత్రం 7 గంటలకు ప్రముఖ కమెడియన్ రజత్ చౌహాన్ హిందీ కామెడీ షో జరుగనుంది. మాల్ లోని మొదటి అంతస్తులో వున్న పల్లడియంలో జరుగనున్న ఈ షోలో పాల్గొనదలచిన ఔత్సాహికులు www.bookmyshow.comలో టిక్కెట్లు పొందవచ్చని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

1 నుంచి కోవైలో సైనికుల ఎంపిక శిబిరం

పెరంబూర్, జూలై 23: కోయంబత్తూర్ నెహ్రూ స్టేడియంలో ఆగస్టు 1 నుంచి 5వ తేది వరకు సైనికుల ఎంపిక శిబిరం జరుగనుంది. ఈ శిబిరంలో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. నీలగిరి, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, దిండుగల్, మదురై, తేని, తిరుప్పూర్, కోయంబత్తూర్ తదితర 11 జిల్లాలకు చెందిన, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు అడ్మిట్ కార్డులో పాల్గొనాలి. మరిన్ని వివరాలకు www.joinindianarmy.nic.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

పుస్తకాల కొనుగోలుకు ప్రత్యేక వెబ్‌సైట్

పెరంబూర్, జూలై 23: గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాల కొనుగోళ్లు పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించాలని గ్రంథాలయ శాఖకు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. కన్నియాకుమారి జిల్లాకు చెందిన కృష్ణన్ దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్రంలోని గ్రంథాలయాలకు సరఫరా చేసే పుస్తకాల కొనుగోళ్లలో అవినీతి చోటుచేసుకుంటుందని, పుస్తకాల కొనుగోళ్లు పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, పుస్తకాల కొనుగోళ్లకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని గ్రంథాలయ శాఖకు ఉత్తర్వులు జారీచేసింది.

యథావిధిగా సబర్బన్ రైళ్లు

పెరంబూర్, జూలై 23: చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య సబర్బన్ రైళ్లు యథావిధిగా నడుస్తాయని దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. తాంబరం యార్డులో మరమత్తుల కారణంగా ఈ నెల 22 నుంచి ఆగస్టు 14వ తేది వరకు చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య 55 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు, ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు ఇదివరకు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికుల సౌకర్యార్థం నిర్ణయం మార్చినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఆ ప్రకారం, మంగళవారం (ఈనె 23వ తేది) నుంచి 26వ తేది, 29 నుంచి ఆగస్టు 2వ తేది వరకు సబర్బన్ రైళ్లు యథావిధిగా నడువనున్నాయి. అదే సమయంలో, 23 నుంచి ఆగస్టు 2వ తేది వరకు రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి 2.30 గంటల వరకు గతంలో ప్రకటించినట్లు అన్ని రైళ్లు రద్దు చేశారు. ఆ సమయాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్-పల్లావరం, పల్లావరం-చెన్నై బీచ్, గుడువాంజేరి-చెంగల్పట్టు, చెంగల్పట్టు-గుడువాంజేరి మధ్య ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు ప్రకటనలో తెలిపింది.

29 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, జూలై 23: తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఈ నెల 29వ తేది వరకు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 కి.మీ వేగంతో పశ్చిమ గాలులు వీచే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రాబోయే 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన స్వల్ప వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 35-36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27-28 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

26న ఓపీఎస్ మద్దతుదారుల సమావేశం

పెరంబూర్, జూలై 23: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఈ నెల 26వ తేది తన మద్దతుదారులతో సమావేశం కానున్నారు. ఈ మేరకు అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ పేరుతో ఓపీఎస్ విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్ అశోక హోటల్‌లో సాయంత్రం బన్రూటి రామచంద్రన్ నేతృత్వంలో జరిగే సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శులు, ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు.

చెన్నై బీచ్ నుంచి చార్మినార్ ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, జూలై 23: తాంబరం యార్డులో మర్మతుల కారణంగా దక్షిణాది జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లే రైళ్ల సేవల్లో మార్పులు చేశారు. ఆ ప్రకారం, హైదరాబాద్-తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ సోమవారం నుంచి ఈ నెల 31వ తేది వరకు తాంబరంకు బదులుగా చెన్నై బీచ్ వరకు మాత్రమే నడుపనున్నారు. మరుమార్గంలో చెన్నై బీచ్ నుంచే బయల్దేరనుంది.

చెన్నై-పుదుచ్చేరి రైలు వేళల్లో మార్పులు

ప్యారీస్, జూలై 23: తిరుచ్చి రైల్వే డివిజన్ పరిధిలోని విల్లుపురం-చిన్నబాబుసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య సిగ్నలింగ్ పనులు చేపట్టనున్న మరమ్మతుల కారణంగా చెన్నై-పుదుచ్చేరి మధ్య నడుపుతున్న రైళ్లను వేరే మార్గం లో నడుపుతున్నట్లు మళ్లించనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఎగ్మూర్ నుంచి ఉదయం 6.35 గంటలకు బయల్దేరే పుదుచ్చేరి మెము ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం విల్లుపురం వరకు మాత్రమే నడిపారు. అదే విధంగా, పుదుచ్చేరి నుంచి సాయంత్రం 3 గంటలకు బయల్దేరాల్సిన తిరుపతి ఎక్స్‌ప్రెస్ మంగళవారం రద్దు చేశారు. అందువల్ల ఈ రైలు సాయంత్రం 3.45 గంటలకు తిరుపతికి బయల్దేరి వెళ్లింది.

26న 'తమిళనాడు హౌస్' శంకుస్థాపన

పెరంబూర్, జూలై 23: దేశ రాజధాని ఢిల్లీలో 'తమిళనాడు హౌస్' శంకుస్థాపన ఈ నెల 26వ తేది జరుగనుంది. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

తగ్గిన పూల ధరలు

పెరంబూర్, జూలై 23: కర్ణాటక, హోసూరు తదితర ప్రాంతాల నుంచి పూలు దిగుమడి పెరగడంతో కోయంబేడు మార్కెట్లో పూల ధరలు తగ్గాయి. ఆ ప్రకారం, కిలో మల్లెపూలు రూ.500, జాజి మల్లె రూ.400, కనకాంబరాలు రూ.600, ఆరణి పూలు రూ.100, చామంతి రూ.160, సంపంగి రూ.80, చాక్లెట్ రోజ్ రూ.70, పన్నీర్ రోజ్ రూ.60కి విక్రయమవుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే

- రోడ్డెక్కిన అన్నాడీఎంకే శ్రేణులు
- నగరంలో 9 ప్రాంతాల్లో ధర్నా





విరుగంబాక్కం, మింట్ జంక్షన్ ధర్నాలో అన్నాడీఎంఏ నేతలు, కార్యకర్తలు

ప్యారీస్, జూలై 23: విద్యుత్ చార్జీల పెంపును ఖండిస్తూ రాజధాని నగరంలో 9 ప్రాంతాల్లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు విద్యుత్ చార్జీలు తగ్గించాలి, రేషన్ దుకాణాల్లో పప్పు, పామాయిల్ సక్రమంగా పంపిణీ చేయాలని నినాదాలతో హోరెత్తించారు. మూడేళ్ల డీఎంకే పాలనలో మూడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, అందువల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడిందని, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు కూడా విపరీతంగా పెంచారని, వీటిని అదుపుచేయలేని ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ పార్టీ తరపున అన్ని జిల్లా కేంద్రాల్లో మంగళవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఇటీవల అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం స్టాలిన్ ప్రతిపక్షనేతగా వ్యవహరించిన సమయంలో విద్యుత్ ఛార్జీల గురించి పలు వేదికలపై ప్రస్తావించేవారని, ఇప్పుడు ఆయన అధికారంలో కొనసాగుతూ ప్రజల సంక్షేమం గురించి ఆలోచించకుండా ఆదాయం పైనే కన్నేశారని ఆరోపించారు. కొత్త విద్యుత్ కనెక్షన్లకు డిపాజిట్ ధర పెంచడంతో పాటు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేలా చేపట్టిన ప్రయత్నాలు విరమించుకోవాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఉత్తర చెన్నై జిల్లా ఆధ్వర్యంలో మాజీ మంత్రి డి.జయకుమార్ అధ్యక్షతన మింట్ జంక్షన్‌లో నిర్వహించిన ధర్నాలో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తర చెన్నై పశ్చిమ జిల్లా తరపున మాజీ ఎంపీ ఎన్.బాలగంగా అధ్యక్షతన, తండయార్‌పేట వైద్యనాథన్ వంతెన సమీపంలో ఉత్తర చెన్నై జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ అధ్యక్షతన, దక్షిణ చెన్నై జిల్లా కార్యదర్శి ఆదిరాజారామ్ నేతృత్వంలో అన్నాసాలై దర్గా సమీపంలో, దక్షిణ చెన్నై పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎంకే అశోక్ నేతృత్వంలో వేళచ్చేరి గాంధీ విగ్రహం వద్ద, ఎంజీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాట్పాడి యూనియన్‌లో 'ప్రజలతో ముఖ్యమంత్రి'

వేలూరు, జూలై 23: స్థానిక కాట్పాడి యూనియన్ పరిధిలోని వల్లిమలై గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ఇద్దరు లబ్దిదారులకు ముఖ్యమంత్రి వైద్య బీమా గుర్తింపుకార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పరిధిలోని మేల్‌పాడి, వల్లిమలై, పెరుమాళ్‌కుప్పం, ఎడుకమ్‌పట్టు, కొల్లపల్లి, మహిమండలం, అమ్మవారిపల్లి తదితర పంచాయతీల ప్రజలు హాజరై వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, వేలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, కలెక్టర్ సమూహ భద్రతా పథకం కలియమూర్తి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత సహ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

అమలుకాని మద్యం సీసాల పథకం

ఏడాదికి రూ.200 కోట్ల నష్టం ● ఈపీఎస్ ఆరోపణ

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం గత మూడేళ్లుగా టాస్మాక్ దుకాణాల్లో విక్రయించే మద్యం సీసాలు వాపసు పథకాన్ని అమలు చేయకపోవడంతో ఖజానాకు రూ.200 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో హైకోర్టు ఆదేశం ప్రకారం టాస్మాక్ సంస్థ ఖాళీ మద్యం సీసాలను టెండర్ల ద్వారా వాపసు చేసుకోవాల్సి ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీ మద్యం సీసాల వాపసు పథకాన్ని బుట్టదాఖలు చేసిందన్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు యేడాదికి రూ.200 కోట్లకు పైగా నష్టం వాటిల్లినా ముఖ్యమంత్రి స్టాలిన్ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే అధికార పార్టీకి చెందినవారంతా సిండికేట్‌గా ఏర్పడి అక్రమంగా బార్లు నడిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన ఆరోపించారు.

మినీ బస్సులను ప్రైవేటు పరం చేయొద్దు

● ఓపీఎస్ డిమాండ్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా సంస్థ మినీ బస్సులను ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర రవాణా సంస్థలో ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కొన్ని రూట్లలో మినీబస్సులను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం గర్హనీయమన్నారు. ఈ విషయమై రవాణా సంస్థ కార్మిక సంఘాలన్నీ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయని, కనుక ఈ యోచనకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని ఓపీఎస్ విజ్ఞప్తి చేశారు.

నీట మునిగిన జలకంఠేశ్వరాలయ నంది విగ్రహం



విగ్రహం నీట మునుగుతున్న దృశ్యం

పెరంబూర్, జూలై 23: సేలం జిల్లా మేట్టూరు జలాశయంలో కావేరి జలాలు రావడంతో జలకంఠేశ్వరుని ఆలయ నంది విగ్రహం నీట మునగడం ప్రారంభించింది. ఈ జలాశయం నిర్మాణ సమయంలో పన్నవాడి సహా పలు గ్రామాలను అధికారులు ఖాళీ చేయించారు. ఆ సమయంలో గ్రామంలోని చర్చి, జలకంఠేశ్వరాలయం తదితరాలను గ్రామస్తులు అలాగే వదిలి వెళ్లారు. డ్యాం నీటిమట్టం 75 అడుగులకు తగ్గితే చర్చి, 70 అడుగుల కంటే తక్కువైతే జలకంఠేశ్వరాలయ నంది విగ్రహం బయటపడుతుంటాయి. ఏడాదిన్నర కాలంగా ఆశించిన వర్షాలు లేక డ్యాం నీటిమట్టం 40 అడుగులకు తగ్గడంతో చర్చి, నంది విగ్రహం బయటపడ్డాయి. ఆ ప్రాంతానికి చెందిన యువకులు నంది విగ్రహానికి రంగులు దిద్దగా, పర్యాటకులు వచ్చి పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, కావేరి జలాల రావడంతో డ్యాం నీటిమట్టం 76 అడుగులకు పైగా చేరడంతో నంది విగ్రహం చుట్టూ నీరు చేరింది. వారం రోజుల వరకు వాగు, సాగు భూమిలా కనిపించిన జలాశయం ప్రస్తుతం సముద్రాన్ని తలపిస్తోందని ప్రజలు చెబుతున్నారు.

మత్తు మాత్రల విక్రయం

● ఇద్దరు బాలుర సహా ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 23: నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో చట్ట వ్యతిరేకంగా మత్తు మాత్రలను విక్రయించిన కేసులో ఇద్దరు బాలురి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి మత్తుమాత్రలను కూడా స్వాధీనం చేసుకున్నారు. కోయంబేడు అసిస్టెంట్ కమిషనర్ సారథ్యంలో ప్రత్యేక పోలీసుల బృందం కోయంబేడు ప్రాంతంలో నిఘా సారించారు. నెర్కుంద్రం సమీపంలో ముగ్గురు వ్యక్తులు మత్తుమాత్రలు విక్రయిస్తున్నట్టు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు వెళ్ళిన ప్రత్యేక బృందం అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోయంబేడు ప్రాంతానికి చెందిన మణికంఠన్ (21)తో పాటు మరో ఇద్దరు బాలలను అరెస్టు చేశారు. వీరి నుంచి 100 మత్తుమాత్రలతో పాటు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు చపాతి, కుర్మా



చపాతి తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆస్పత్రి డీన్ సీతాలక్ష్మి

పెరంబూర్, జూలై 23: విరుదు నగర్ ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే తొలిసారిగా ఇన్‌పేషంట్లకు రాత్రి ఆహారంగా వారంలో మూడు రోజులు చపాతి, కుర్మా అందించనున్నట్లు ఆసుపత్రి డీన్ సీతాలక్ష్మి తెలిపారు. విరుదు నగర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో మధుమేహం రోగులకు మాత్రమే రాత్రి ఆహారంగా చపాతీలు అందిస్తున్నారు. తమకు కూడా రాత్రి వేళ చపాతీలు ఇవ్వాలని ఇతర విభాగాల్లో చికిత్స పొందుతున్న పేషెంట్లు ఆసుపత్రి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. దీనిని ఆహార నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమోదించారు. ఆస్పత్రి నిర్వహణ నిధులు రూ.2.97 లక్షలతో చపాతి మేకింగ్ మెషీన్ కొనుగోలు చేశారు. ఆ ప్రకారం ఆస్పత్రి అన్ని విభాగాల్లో ఇన్‌పేషంట్లకు సోమ, బుధ, శుక్ర వారాల్లో చపాతి, కుర్మా అందజేస్తున్నారు. అలాగే, పిల్లలకు ఉదయం దోశ, రాత్రి చపాతి ఇస్తున్నారు. దీనికి కుకింగ్ మాస్టర్‌గా సంతానం ఉన్నట్లు డీన్ సీతాలక్ష్మి తెలిపారు.

కలెక్టరేట్‌లో ఏసీ గ్రంథాలయం



కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటవుతున్న గ్రంథాలయం

పెరంబూర్, జూలై 23: తిరువళ్లూర్ కలెక్టర్ కార్యాలయ కింది అంతస్తులో ప్రజలు, పోటీ పరీక్షలు రాసే వారి కోసం అధునాతన వసతులతో ఏసీతో గ్రంథాలయం నిర్మిణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలు సేదతీరేందుకు పార్క్ ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో, ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం, పోటీ పరీక్షలు రాసే వారి కోసం కార్యాలయ కింది అంతస్తులో ఏసీ సదుపాయంతో గ్రంథాలయం ఏర్పాటుకానుంది. నిర్మాణపనులు పూర్తిచేసి త్వరలోనే ఈ గ్రంథాలయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

పురువునష్టం దావా కేసు ...

కోర్టుకు హాజరైన సీవీ షణ్ముగం



అడయార్, జూలై 23: ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అగౌరవపరిచేలా మాట్లాడిన (పరువు నష్టం దావా) కేసులో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగం మంగళవారం విల్లుపురం కోర్టు విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ అరెస్టును ఖండిస్తూ విల్లుపురం పాత బస్టాండు సమీపంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో మాట్లాడిన సీవీ షణ్ముగం సీఎం స్టాలిన్‌ను కించపరిచేలా, అగౌరవపరిచేలా ప్రసంగించారు. దీంతో ఆయనపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, విల్లుపురం కోర్టులో విచారణ సాగుతుంది. మంగళవారం ఈ కేసు విచారణకు రాగా సీవీ షణ్ముగం హాజరయ్యారు. ఆ తర్వాత తదుపరి విచారణను ఆగస్టు 13వ తేదీకి న్యాయమూర్తి రాధిక వాయిదా వేశారు.

ఎయిర్‌పోర్ట్‌లో 2.5 కిలోల బంగారం స్వాధీనం

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో కువైట్ నుంచి వచ్చిన ప్రయాణికుడి నుండి 2.5 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కువైట్ నుంచి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా చెన్నైకి చెందిన షేక్ మహమ్మద్ పీర్ ప్రవర్తన వింతగా కనిపించింది. దీంతో ఆయనను ఓ గదిలోకి తీసుకెళ్లి తనిఖీ చేయగా, లోదుస్తుల్లో ఉన్న బంగారు కడ్డీలను గుర్తించారు. వెంటనే ఆ బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకుని ఆయనను పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి కేసు విచారణ జరుపుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 23: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: పొన్నియమ్మన్ నగర్, గ్యాలెక్సీ, గ్యాలెక్సీ రోడ్డు, పెరియార్ వీధి, శివపాదం వీధి, ఈస్ట్ మొగప్పేర్, పెరుమాల్ ఆలయ వీధి, మోహన్‌రామ్ నగర్, భారతిదాసన్ నగర్, కొంగు నగర్, వీజీపీ నగర్, పన్నీర్ నగర్, నొలంబూర్, ఎస్ఎస్‌పీ సర్వీస్ రోడ్డు కేజీ నుంచి ఎంజీఆర్ కాలేజ్ వరకు, ఎంసీకే లేఅవుట్, ఎంజీఆర్ కాలేజ్, కుళక్కరై వీధి, ఎస్బీ గార్డన్, వీజీఎన్ మినర్వ, శక్తి నగర్, నొలంబూర్ ఫేస్-2, పచ్చయప్ప పాఠశాల రోడ్డు, శ్రీరామ్ నగర్, శక్తి నగర్, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, గోకులం ఫేస్-1 నుంచి 4 వరకు, అభినయం ఫేస్-1 నుంచి 3 వరకు, బొర్మా అపార్ట్‌మెంట్, శ్రీ రోష్ అపార్ట్‌మెంట్స్ 1,2, ఎస్ఎస్ఎస్ ఫేస్-1 (8వ వీధి నుంచి 27వ వీధి వరకు) మిథులం అపార్ట్‌మెంట్, పాడి, పాడి ఎక్స్‌ప్రెస్, పాండురంగాపురం, టీవీఎస్ నగర్, పడవేట్టమ్మన్ ఆలయ వీధి, పొన్నిమయమ్మన్ ఆలయ వీధి, శివాలయం వీధి, సేక్కిలార్ వీధి, వళ్లలార్ వీధి, బాలాజీ నగర్, అయ్యపాక్కం, ఐసీఎఫ్ కాలని, హౌసింగ్‌బోర్డుక్వార్టర్స్ ఫేస్-1, 2ప్లాట్స్ 7,000 నుంచి 10,000 వరకు, హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ ఫేస్-3.

ఆదంబాక్కం: గంగై నగర్, బాలాజీ కాలని, శక్తి విజయలక్ష్మి నగర్, ఎస్ఎస్ఐ మెరిడియన్, పీజేపీ గార్డన్, అష్టలక్ష్మి నగర్.

అడయార్: బీసెంట్ నగర్ కక్కన్ కాలని 6వ క్రాస్ వీధి నుంచి 15వ క్రాస్ వీధి వరకు, 2వ మెయిన్ రోడ్డు, ఆర్బీఐ కాలని, కక్కన్ కాలని 4వ క్రాస్ వీధి, 2,3 అవెన్యూ ప్రాంతాలు, 16వ క్రాస్ వీధి, 7వ అవెన్యూ, టైగర్ వరదాచారి రోడ్డు, 29వ క్రాస్ వీధి, కొట్టివాక్కం, వర్శిటీ నగర్, జగన్నాథన్ వీధి, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, కొట్టివాక్కం కుప్పం, కుప్పం రోడ్డు, ఏజీఎస్ కాలని 1,2 వీధులు, లక్ష్మీవధాన వీధి, సెంతామరైకన్నర్ రోడ్డు, ఉద్దాండి, ఇంజంబాక్కం, నైనార్ కుప్పం, మీనాక్షి వీజీపీ 1,2 ప్రాంతాలు, రఘువరన్ గార్డన్, రంగనాధన్ అవెన్యూ, రాజన్ రోడ్డు, కేకేఆర్ అరుణ పార్క్, రాకాష్ దంత వైద్య కళాశాల, హెచ్‌డీ సర్వీస్‌స్టేషన్ గార్డన్, ఎంజీఆర్ రోడ్డు, పీవీఆర్ సినిమాస్, ఉత్తాండి విలేజ్, పాలమ్స్ స్ప్రింగ్, రాజీవ్‌గాంధీ నగర్, ఇందిరా నగర్, ప్రార్థన ఈసీఆర్ రోడ్డు, పాండియన్ నగర్, వెట్టువాంకేని, బిస్మిల్లా నగర్, రాజేంద్ర గార్డన్, టీచర్స్ కాలని, వోర్కర్ ఎస్టేట్, రాజా నగర్, కపాలీశ్వర నగర్ ఫేస్-1.

షోలింగనల్లూర్: జెల్ నగర్, నన్‌మంగళం, కోవిలంబాక్కం, షిర్డీ అపార్ట్‌మెంట్, వడక్కుపట్టు మెయిన్ రోడ్డు, సాయిరాం నగర్, యునైటెడ్ కాలని, పుష్పా నగర్, కలైంజర్ నగర్, వందవెల్లి వీధి.

తాంబరం: చిట్లపాక్కం, ఎంసీ నగర్, నెహ్రూ నగర్, ఎంసీ నగర్ 1 నుంచి 3వ మెయిన్ రోడ్లు, నెహ్రూ వీధి, శ్రీనివాసన్ నగర్, ఎంజీఆర్ నగర్, రాజరాజేశ్వరి నగర్, రామన్ వీధి, బీఎస్ఎన్ఎల్, సిలప్పదికారం వీధి, తొల్‌కాపియర్ రోడ్డు, వావూసీ వీధి, తిరుక్కురల్ వీధి, కన్నగి వీధి, తిరువళ్లువర్ రోడ్డు, పురనానూరు వీధి, జగన్నాథ నగర్, మహాలక్ష్మి వీధి, సెంబాక్కం, రాజ్‌కీల్పాక్కం, వీజీపీ శ్రీనివాస నగర్, మాడంబాక్కం, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, రాజాంబాళ్ నగర్, సౌత్, వెస్ట్ మాడ వీధులు, మూర్తి నగర్, పెరియార్ నగర్, చంద్రబోస్ నగర్, ముల్లై నగర్, చంద్రప్రభ నగర్, పెరియపాళై అమ్మన్ ఆలయ వీధి, పెరుంగళత్తూర్, గాంధీ రోడ్డు, కృష్ణా రోడ్డు, ముత్తువేలర్ రోడ్డు, ఎన్టీఓ కాలని, ఆర్ఎంకే నగర్, భారతి నగర్, కామాక్షి నగర్, శేఖర్ నగర్, కల్కి వీధి, బాలాజీ నగర్, వివేకా నగర్, డేవిడ్ నగర్, సేలయూర్, కొంబై రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, భారతి పార్క్ వీధి, కరణం వీధి, రాజా అయ్యర్ వీధి, నెల్లూరు అమ్మన్ ఆలయ వీధి, మాతా ఆలయ వీధి, పళయత్తాన్ వీధి, న్యూ బాలాజీ నగర్, అవ్వై నగర్, కన్నన్ నగర్, ఐటీబీ కాలని.

పీఎంకే నేత అరెస్టు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మనలి పుదునగర్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన పీఎంకే నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ బేబి తన సిబ్బందితో కలిసి మనలి పుదునగర్ సమీపం ఆండార్ కుప్పం వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ జరిపారు. ఆ సమయంలో వేగంగా వెళ్ళిన టిప్పర్ లారీకి జరిమానా విధించారు. ఈ విషయం తెలుసుకున్న పీఎంకే నేత కుబేంద్రన్ హుటాహుటిన అక్కడికి వెళ్ళి పోలీసులతో గొడవపెట్టుకున్నారు. ఆ సందర్భంగా కానిస్టేబుల్ శరవణన్‌పై దాడికి దిగారు. శరవణన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కుబేంద్రన్‌ను అరెస్టు చేశారు.

భూకబ్జా కేసులో మాజీ మంత్రి విచారణ

నేడు కోర్టులో హాజరు

అడయార్, జూలై 23: నకిలీ పత్రాలతో రూ.100 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసిన కేసులో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌ను సీబీసీఐడీ అధికారులు ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. కోర్టు అనుమతితో రెండు రోజుల కస్టడీకి తీసుకున్న పోలీసులు.. భూకబ్జా కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. ప్రధానంగా బాధితుడు ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అనేక అంశాలపై ప్రశ్నించారు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక మాజీ మంత్రి మౌనంగా ఉండిపోవడం లేదా తనకు తెలియని మాత్రమే సమాధానం చెప్పినట్టు సమాచారం. ఈ విచారణ సోమవారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగించారు. రెండో రోజైన మంగళవారం కూడా ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగింది. మరోవైపు కోర్టు ఇచ్చిన కస్టడీ బుధవారం మధ్యాహ్నంతో ముగియనుంది.ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరి, జైలుకు తరలించనున్నారు.

మేట్టుపాళయం రోడ్డుపై గజరాజు సంచారం

అడయార్, జూలై 23: కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో బహుబలి వంటి ఒక ఏనుగు రోడ్డుపైకి వచ్చి తిరిగింది. మంగళవారం ఉదయం 6 గంటలకు ఈ ఏనుగు రోడ్డుపైకి వచ్చింది. దీన్ని చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొంతసేపు రోడ్డుపై సంచరించిన ఈ ఏనుగు.. ఆ తర్వాత నెల్లిమలై అడవిలోకి వెళ్ళిపోయింది. అయితే, ఈ ఏనుగు రోడ్డుపైకి వచ్చినప్పటికీ స్థానికులు ఎలాంటి హాని కలిగించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మేట్టుపాళయం అటవీ ప్రాంతంలో వనభద్రకాళి అమ్మన్ వార్షిక వేడుకలు జరుగనున్నాయని, ఇలాంటి సమయంలో ఏనుగు రోడ్డుపైకి రావడం ఆందోళన కలిగిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఆగని శ్రీలంక నావికాదళం దాడులు

9 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు ● 2 పడవల స్వాధీనం

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి సమీపంలో మంగళవారం వేకువజాము చేపలు పడుతున్న రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం విరుచుకుపడింది. రెండు గస్తీ నౌకల్లు వచ్చిన నావికాదళం రామేశ్వరం ప్రాంతానికి చెందిన ఐజాక్ రాబిన్, సెల్వకుమార్‌కు చెందిన రెండు మరపడవలను చుట్టుముట్టి జాలర్లపై దాడికి దిగారు. పడవల్లోని వలలు, చేపలు, డీజిల్ క్యాన్‌లను ధ్వంసం చేసి సముద్రంలోకి విసిరేశారు. ఆ తర్వాత పడవల్లో ఉన్న సహాయరాబర్ట్, రాధా, ముత్తురామలింగం, యాకోబు, హరికృష్ణన్. ఆయన కుమారులు పొన్‌రామదాస్, రామ్‌కుమార్, విపిన్‌రాజ్ సహా తొమ్మిది మంది జాలర్లను అరెస్టు చేసి శ్రీలంకలోని కాంగేశన్ రేవుకు తీసుకెళ్లింది. జాలర్లతో పాటు వారి పడవలను కూడా శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుంది. విషయం తెలుసుకున్న రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అరెస్టయిన జాలర్లను విడిపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిధుల విడుదల కోసం సర్పంచ్ ధర్నా



ధర్నా చేస్తున్న సర్పంచ్ సెల్వి రమేష్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులున్నా వాటిని విడుదల చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ తిరుప్పూరు జిల్లా గౌండచ్చిపుదూరు మహిళా సర్పంచ్ సెల్వి రమేష్ పంచాయతీ యూనియన్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. తమ పంచాయతీలో నిధులకు కొదువ లేదని, సుమారు రూ.2.25 కోట్ల మేరకు నిధులున్నాయని, వాటిని తొమ్మిది వార్డుల్లో అభివృద్ధిపనులకు పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు చేశామని, అయితే ఆ నిధుల విడుదలకు పాలనపరమైన అనుమతి ఇవ్వ చేయకుండా అధికారులు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ ఆమె ధర్నా చేపట్టారు. మంగళవారం కూడా ఆమె ధర్నాను కొనసాగించారు.

తంజావూరు ప్యాలెస్‌లో పురాతన బావి



రాజ్ మహల్ ప్రాంగణంలో బయల్పడిన బావి

పెరంబూర్, జూలై 23: తంజావూరును పరిపాలించిన చోళులు, నాయకర్లు, మరాఠా రాజులు, 110 ఎకరాల్లో రాజ భవనాన్ని నిర్మించారు. ఆ భవనంలో దర్బార్ మహల్, ఆయుధ భాండాగారం, బెల్ టవర్ తదితరాలను అందమైన శిల్పాలతో నిర్మించారు. రాష్ట్ర పురావస్తు శాఖ ఈ ప్యాలెస్‌ను తన ఆధీనంలోకి తీసుకొని రక్షిత ప్రాంతంగా ప్రకటించి, పునర్నిర్మాణ పనులు చేపట్టింది. ఇందుకోసం రూ.25 కోట్లు కేటాయించి ప్రాచీనత చెక్కుచెదరకుండా పునర్నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఈ భవనంలో చెత్తకుప్పగా ఉన్న ప్రాంతంలోని చెట్లు తీగలు తొలగించగా, అక్కడ పురాతన బావి బయల్పడింది. ఈ విషయమై పరిశోధకులు మాట్లాడుతూ... నాయకర్ల కాలంలో పలురకాల జలాశయాలు, జలమార్గాలు ఏర్పాటుచేశారన్నారు. రాజభవనం ప్రాంగణంలో బయల్పడిన బావి కూడా నాయకర్ల హయాంలోనే నిర్మించి ఉండొచ్చని తెలిపారు. ఈ బావిని రాజ వంశీయులైన స్త్రీలు వినియోగించేవారన్నారు. ఈ బావికి ఏర్పాటుచేసిన నీటి కాలువను కనుగొని నీటి సరఫరాకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని వారు తెలిపారు.

ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ



ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీ జగద్రక్షకన్

వేలూరు, జూలై 23: స్థానిక కాట్పాడి ప్రాంతంలో అరక్కోణం ఎంపీ జగద్రక్షకన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అరక్కోణం నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన జగద్రక్షకన్ విజయం సాధించారు. ఆయన మంగళవారం సెంగుట్టై, పల్లికుప్పం, దారాపడవీడు, గుట్టిమేడు, గాంగేయనల్లూర్, గాంధీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, ప్రాంత కార్యదర్శులు వన్నియరాజా, పరమశివం, డీఎంకే కౌన్సిలర్లు చిత్ర, విమల పూంజోలై సహా డివిజన్ సెక్రటరీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టైరు పగిలి.. బస్సు షెల్టర్‌ను ఢీకొని సిమెంటు లారీ బోల్తా

● బస్తాల నడుమ ఇరుక్కుని మృతిచెందిన డ్రైవరు

● కల్లూరు ఘాట్‌రోడ్డులో ప్రమాదం

కల్లూరు, జూలై 23: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో సిమెంటు లారీ టైరు పగిలింది. అదుపుతప్పి పక్కనున్న బస్సు షెల్టరును ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ శివరాఘవన్ మృతిచెందారు. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లారీ డ్రైవరు శివరాఘవన్‌ది తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై తాలూకా తాండేరి పోస్టు అప్పాపట్టి గ్రామం. నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సిమెంటు లోడుతో కోయంబత్తూరుకు బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం కల్లూరు ఘాట్ రోడ్డు మలుపు కొమ్మిరెడ్డిగారిపల్లి బస్సు షెల్టర్ సమీపానికి చేరుకోగా.. లారీ ముందు టైరు బరస్ట్ అయింది. దీంతో ఒక్కసారిగా లారీ అదుపుతప్పింది. దీనిని డ్రైవర్ అదుపుచేసే క్రమంలో సమీపంలోని బస్సు షెల్టర్‌ను లారీ ఢీకొంది. దీంతో బస్సు షెల్టర్ కూలిపోయింది. లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగు సీటులో ఉన్న డ్రైవరు.. సిమెంటు బస్తాల మధ్యలో ఇరుక్కుపోయారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. లారీ బోల్తా పడటంతో సిమెంటు బస్తాలు పగిలి చెల్లాచెదరుగా పడిపోవడంతో సిమెంటు దుమ్ముతో ఆ ప్రాంతం నిండిపోయింది. సీటులో.. సిమెంటు బస్తాల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. జేసీబీ సాయంతో 2గంటలు శ్రమించి డ్రైవర్ శివరాఘవన్‌ను బయటకు తీయగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు షూటింగులు బంద్ : ఫెఫ్సీ



ఏళుమలై (ఫైల్‌ఫొటో)

ఈ నెల 25వ తేదీ గురువారం సినిమా షూటింగులను రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. షూటింగుల్లో పనిచేసే సినీ నిర్మాణ కార్మికుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై చర్చించేందుకు ఈ నెల 25న ఫెఫ్సీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసింది. దీంతో ఆ రోజు జరగాల్సిన అన్ని చిత్రాల షూటింగులను రద్దు చేశారు. ఇటీవల 'సర్దార్-2' సినిమా షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో స్టంట్‌మేన్ ఏళుమలై ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెల్సిందే. దీంతో సినీ నిర్మాణ కార్మికుల్లో షూటింగుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలని ఫెఫ్సీ నిర్ణయించి, ఒక ప్రకటన విడుదల చేసింది. 'సినిమా షూటింగుల సమయంలో అంబులెన్స్‌తో పాటు తగిన భద్రతా ప్రమాణాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని నిర్మాతలను ఎప్పటి నుంచో అభ్యర్థిస్తున్నాం. కానీ, చాలా నిర్మాణ సంస్థలు ఈ విషయంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. అందుకే సినీ కార్మికుల్లో అవగాహన కల్పించే నిమిత్తం బుధవారంఉదయం 9గంటలకు వడపళనిలోని కమల థియేటర్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశాం. ఈ సమావేశానికి ఫిల్మ్, టీవీ ఔట్‌డోర్ యూనిట్ లైట్‌మెన్ యూనియన్, టెక్నీషియన్స్ యూనియన్, ఫైట్ డైరెక్టర్స్, ఆర్టిస్ట్ యూనియన్, కొరియోగ్రాఫర్స్ ఆర్టిస్ట్ యూనియన్, సెట్టింగ్ వర్కర్స్ యూనియన్‌లోని ఐదు సంఘాల సభ్యులంతా విధిగా హాజరుకావాలని ఫెఫ్సీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

విష్ణు దర్శకత్వంలో నయనతార - కవిన్ చిత్రం

చిత్రజ్యోతి


అగ్రహీరోయిన్ నయనతార, యువ హీరో కవిన్ కలిసి ఒక చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రానికి యంగ్ డైరెక్టర్ విష్ణు ఇడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనకరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగానే కాకుండా గేయ రచయితగా కూడా విష్ణు రాణించారు. వీరి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రకటన తాజాగా వెల్లడించారు. నయనతార, కవిన్‌లో చాలా దగ్గరగా కలిసి నిలబడివున్న ఫొటోను షేర్ చేశారు. అయితే, ఇందులో నటించే ఇతర నటీనటుల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కాగా, కవిన్ 'బ్లడీ బెగ్గర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని లోకేష్ కనకరాజ్ నిర్మిస్తున్నారు. అలాగే, నయనతార గత యేడాది 'అన్నపూరిణి'గా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ తర్వాత ఆమె నటించిన సినిమా ఒక్కటి కూడా విడుదలకాలేదు. కానీ, 'టెస్ట్', 'మన్నాంగట్టి', 'డియర్ స్టూడెంట్స్' వంటి చిత్రాలు లైనులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నయనతార - కవిన్‌లతో కొత్త చిత్రాన్ని నిర్మించేందుకు 7 స్క్రీన్ స్టూడియో శ్రీకారం చుట్టింది.


నయనతార - కవిన్

మంచి పాత్ర వస్తే మళ్ళీ నటిస్తా : నటి రంభ



తనకు మంచి పాత్ర లభిస్తే మళ్ళీ సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీనియర్ నటి రంభ ప్రకటించారు. ఇటీవల నగరానికి వచ్చిన ఆమె మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'సినిమాల్లో నటించి పాతికేళ్ళు గడిచిపోయాయి. అనేక మంది హీరోలతో కలిసి నటించాను. అందువల్ల ఇకపై ఫలానా హీరో చిత్రంలో నటించాలన్న ఆశ లేదు. మంచి కథాపాత్ర వస్తే మాత్ర ఖచ్చితంగా మళ్ళీ నటిస్తాను. హీరో విజయ్ రాజకీయాల్లోకి రావడం అనేది ఒక సాహసంతో కూడుకున్నది. ఆయనతో కలిసి 'నినైత్తేన్ వందాయ్' చిత్రంలో నటించాను. అప్పటికీ ఇప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పులేదు. కాకపోతే, అపుడు మౌనంగా ఉండేవారు. ఇపుడు కాస్త జాలీగా మాట్లాడుతున్నారు' అని అన్నారు. కాగా, ఇటీవల చెన్నై వచ్చిన ఆమె హీరో విజయ్‌ను తన పిల్లలతో కలిసి ఫొటోలు దిగిన విషయం తెల్సిందే.



ప్రజలు ఆహ్వానిస్తే రావాల్సిందే కదా?

● హీరో విశాల్

రాజకీయాల్లోకి రావాలని ప్రజలు ఆహ్వానిస్తే ఖచ్చితంగా వచ్చి తీరాల్సిందేనని హీరో విశాల్ అంటున్నారు. ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై స్పందించారు. 'నేను రాజకీయాల్లోకి రావాలా? వద్దా? అనేది ప్రజలు నిర్ణయించాలి. రాజకీయాల్లోకి రావాలని వారు ఆహ్వానిస్తే వచ్చి తీరాల్సిందే. ప్రజలకు అన్ని సౌకర్యాలు లభిస్తే సినిమా హీరోలు ఎందుకు రాజకీయాల్లోకి వస్తారు. ప్రజలు కష్టపడుతున్నారని, వారిని ఆదుకునేందుకే సినీ హీరోలు రాజకీయాల్లోకి వస్తున్నారు. చిత్రపరిశ్రమలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరూ ఇండస్ట్రీలో జోక్యం చేసుకోలేదు. సినిమా పరిశ్రమను అలాగే ఉండనిస్తే చాలు. రాష్ట్రంలో రెండు రకాల జీఎస్టీలు వసూలు చేస్తున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఈ విధానంలో మార్పులేదు. చిత్ర పరిశ్రమ కష్టాల్లో ఉంది. చిన్న చిత్రాలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం కనుగొని చిన్న నిర్మాతలను బతికించాలి' అని కోరారు.

వండలూరు జూలో వాల్పారై పులి

పార్లీస్, జూలై 23: కోయంబత్తూర్ జిల్లా వాల్పారైలో పట్టుబడిన పులిని అటవీ శాఖ అధికారులు వండలూరు జూ పార్క్‌కు తరలించారు. వాల్పారై సమీపంలోని మోడీస్ ఎస్టేట్ ప్రాంతంలో 2021 అక్టోబరులో జనావాసాల్లోకి వచ్చిన పులిని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. దానికి గాయాలుండడం గుర్తించి చికిత్సలందించారు. ఏడాది పాటు అందించిన చికిత్సతో కోలుకున్న పులిని జాతీయ పులుల కమిషన్ సూచనల మేరకు ప్రత్యేక వాహనంలో వండలూరు జూకు తరలించారు. పులిని ప్రత్యేక బోనులో ఉంచి పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


వండలూరు పార్క్‌లో వాల్పారై పులి


అనకొండ పిల్లలు

ఆకట్టుకుంటున్న ఎల్లో అనకొండ పిల్లలు

వండలూరు జూ పార్క్‌లో సంరక్షిస్తున్న ఎల్లో అనకొండ 20 పిల్లలకు జన్మనిచ్చింది. ఆ పిల్లలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఈ జూ పార్క్‌లో ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.200, బ్యాటరీ, సఫారీ వాహనాల్లో తిరిగేందుకు రూ.150గా నిర్ణయించారు. ఈ పార్క్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద పాము జాతుల్లో ఒకటైన రెండు ఎల్లో అనకొండలను పరామర్శిస్తున్నారు. ఈ రెండు ప్రస్తుతం 20 పిల్లలకు జన్మనిచ్చాయి. పిల్లలను అద్దాల బోనులో ఉంచి సంరక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అలరిస్తున్న 'హాయ్ లైఫ్'


ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి సుజా వరుణి

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని 'ది హయత్ రీజెన్సీ' హోటల్లో 'హాయ్ లైఫ్' పేరుతో ప్రత్యేక ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో వందకు పైగా అగ్రశ్రేణి డిజైనర్లు, ట్రెండ్-సెట్టింగ్ బ్రాండ్‌లకు ఈ ప్రదర్శనలో పలు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. నటి సుజా వరుణి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చెన్నైలోని ఫ్యాషనర్లు, సెలబ్రిటీలతో తాము ఎల్లప్పుడూ అనుబంధాన్ని కలిగి వున్నామన్నారు. హాయ్ లైఫ్ ప్రదర్శన ఆధునిక మహిళా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, స్టయిల్, ఫ్యాషన్‌కి సంబంధించిన వేడుక అని వివరించారు.

ముమ్మర సేవా కార్యక్రమాలు

● డాక్టర్ సంతోష్‌కుమారి


డాక్టర్ సంతోష్‌కుమారితో రోటరీ క్లబ్ బృందం

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మున్ముందు ముమ్మరంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సెంట్రల్ ఎలైట్ తొమ్మిదవ అధ్యక్షురాలిగా, తొలి మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన డాక్టర్ సంతోష్ కుమారి రాథోడ్ ప్రకటించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె తన కార్యవర్గ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోటరీ నెట్‌వర్కింగ్, స్నేహసంబంధాలతో సమాజ సేవ విస్తృతం చేస్తామన్నారు. పారాలింపిక్ ఈవెంట్, ప్రత్యేక చిన్నారుల కోసం రోటరీ స్పెషల్ స్పోర్ట్స్, వివిధ ప్రత్యేక పాఠశాలలకు చెందిన పిల్లలు పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అవసరమైన శానిటరీ ప్యాడ్‌లతో పాటు పరిశుభ్రతా సామగ్రిని అందిస్తామన్నారు. రక్తదాన శిబిరాలు మరింత విస్తృతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ 3222 జిల్లా గవర్నర్ మహావీర్ బోత్రా హాజరయ్యారు.

గిండి ఆస్పత్రిలో సీఎం స్టాలిన్ తనిఖీలు


ఆస్పత్రిలో అత్యవసర చికిత్సా విభాగంలో రోగిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని కలైంజర్ శతజయంతి స్మారక ప్రభుత్వ ప్రత్యేక ఆస్పత్రిని ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్ళి వారికి లభిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి ఔట్ పేషంట్లుగా వస్తున్నవారిని కలుసుకుని వారికి లభిస్తున్న సేవల గురించి వాకబు చేశారు. ఆస్పత్రిలోని అత్యవసర చికిత్సా విభాగాల్లో రోగులను పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి డీన్ డాక్టర్ పార్థసారథి, ప్రత్యేక అధికారి డాక్టర్ రమేష్, ఇతర అధికారులతో కలిసి ఆస్పత్రిలో ఉన్న సాంకేతిక వైద్య పరికరాలను సందర్శించి, వాటి పనితీరు గురించి వైద్యనిపుణుల ద్వారా తెలుసుకున్నారు. ఆస్పత్రి క్యాంటీన్‌లోనూ ఆయన తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న అల్పాహారం, రొట్టెలు, పాలు నాణ్యత పరిశీలించారు. ఆస్పత్రిలోని హాజరు పట్టీ కూడా పరిశీలించి డ్యూటీలో ఎవరెవరున్నారని కూడా తెలుసుకున్నారు. చివరగా వైద్యనిపుణులతో సమావేశమై ఆస్పత్రిలో మరిన్ని వైద్య సదుపాయాలు అందించేందుకు కొత్త పరికరాలేవైనా కొనుగోలు చేయాలా అని స్టాలిన్ అడిగారు. ప్రస్తుతం ఆస్పత్రికి వస్తున్న రోగులకు ఉన్న వ్యాధులకు మెరుగైన చికిత్స చేయడానికి నవీన సాంకేతిక పరికరాలు మెండుగా ఉన్నాయని, కొత్త పరికరాలను కొనాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు ఆయనకు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. అనంతరం సచివాలయానికి బయలుదేరి వెళ్లారు.

వైద్యనిపుణుల కోసం న్యూరో ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిమ్యులేషన్ కోర్సు

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోళింగనల్లూరులో వున్న గ్లెనగల్స్ హెల్త్ సిటీ ఆస్పత్రికి చెందిన న్యూరో సైన్సెస్ విభాగం వైద్య నిపుణుల కోసం న్యూరో ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిమ్యులేషన్ (ఎన్ఈఎంఎస్) కోర్సు ప్రారంభించింది. సీనియర్ వైద్యులు డాక్టర్ దినేష్ నాయక్ నేతృత్వంలో సాగుతున్న ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే వారికి నిజజీవిత దృశ్యాలకు సిద్ధం చేయడానికి తీవ్రమైన నాడీ సంబంధిత అత్యవసర పరిస్థితులను అనుకరించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాథ్యూజోసెఫ్, డాక్టర్ తిలకముత్తయ్య, డాక్టర్ ప్రతీమ రామచంద్రన్, డాక్టర్ రమణన్ రాజగోపాల్, డాక్టర్ ప్రసాద్ కుమరేశన్, డాక్టర్ నిగెల్ పీటర్ సిమ్స్, డాక్టర్ నటేశన్ దామోదరన్, డాక్టర్ మోహన సెల్వి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు


బయో మెడికల్ విభాగాన్ని పరిశీలిస్తున్న డా.సౌమ్య స్వామినాథన్

అన్నావర్సిటీలో 'బయో మెడికల్' విభాగం

పెరంబూర్, జూలై 23: అన్నా విశ్వవిద్యాలయంలో 'బయో మెడికల్' పేరిట కొత్త విభాగం ప్రారంభమైంది. ఈ వర్సిటీలో ప్రస్తుతం మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ టెలికమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ సైన్స్, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ వంటి విభాగాలున్నాయి. ఈ విభాగాల ఆధ్వర్యంలో పలురకాల కోర్సులు, యూజీ, పీజీ కోర్సులు, పరిశోధన కోర్సులున్నాయి. ఇప్పటివరకు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో బయో మెడికల్ పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, వైద్యరంగంలో పెరుగుతున్న వివిధ అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలు, సాంకేతిక పురోగతి తదితరాలు పరిగణలోకి తీసుకొని బయో మెడికల్ ప్రత్యేక విభాగం ప్రారంభించారు. వర్సిటీ ఉపకులపతి వేల్‌రాజ్ నేతృత్వంలో సోమవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో, కేంద్ర ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ అడ్వయిజర్ డా.సౌమ్య స్వామినాథన్ కొత్త విభాగాన్ని ప్రారంభించారు. ఈ శాఖ ఆధ్వర్యంలో బయో మెడికల్, ఎంఈ బయో మెడికల్, పరిశోధన కోర్సులు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి శశికళ తెలిపారు.

కడలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా అను


ఐఏఎస్ అధికారి అను

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడలూరు కార్పొరేషన్ తొలి మహిళా కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అను నియమితులయ్యారు. 2021లో కడలూరు మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్‌గా హోదా పెంచింది. ఆ నేపథ్యంలో 2022లో కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా సుందరి రాజా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు ఐఏఎస్ అధికారులను కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు కడలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అను నియమితులయ్యారు. కడలూరు కార్పొరేషన్‌కు తొట్టతొలిసారిగా ఐఏఎస్ ర్యాంక్ అధికారి కమిషనర్‌గా నియమితులు కావటం పట్ల కార్పొరేటర్లు హర్షం ప్రకటిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కడలూరు జిల్లా కలెక్టర్‌గా సీపీ ఆదిత్యా సెంథిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆ నేపథ్యంలో ఆయన సతీమణి కడలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

త్వరలో మరో ఐదు వందే భారత్ రైళ్లు

పెరంబూర్, జూలై 23: స్థానిక ఐసీఎఫ్ కర్మాగారంలో తయారైన ఐదు వందే భారత్ రైళ్లను మరో రెండు వారాల్లో రైల్వే బోర్డుకు అప్పగించనున్నారు. పెరంబూర్ సమీపంలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో 500 డిజైన్లలో సుమారు 75,000లకు పైగా రైలు పెట్టెలు తయారుచేశారు. ఈ కర్మాగారంలో కొన్నేళ్లుగా వందే భారత్ రైళ్లను తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్ల నిర్మాణం పూర్తికాగా, తుది దశ పరిశీలన చేపట్టారు. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ... ఇప్పటివరకు 60కి పైగా వందే భారత్ రైళ్లను రైల్వే బోర్డుకు అప్పగించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 3,515 రైలు పెట్టెలు తయారుచేయనున్నామని తెలిపారు. వీటిలో 1,536 ఎల్‌హెచ్‌బీ, 658 వందే భారత్ బోగీలున్నాయన్నారు. ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్ల తయారీ పూర్తికాగా, ప్రస్తుతం తుది దశ పరిశీనలో ఉన్నాయని తెలిపారు. ఈ రైళ్లను రైల్వే బోర్డుకు పంపనున్నామని, ఏఏ మార్గాల్లో ఈ రైళ్ల నడపాలన్నది రైల్వే బోర్డు నిర్ణయిస్తుందని అధికారులు తెలిపారు.


ఐసీఎఫ్ కర్మాగారంలో తయారైన వందే భారత్ రైళ్లు

విజయవంతంగా ఎన్‌ఎల్‌సీ కస్టమర్ మీట్


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

అడయార్, జూలై 23: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్ మంగళవారం కస్టమర్ మీట్‌ను నగరంలో విజయవంతంగా నిర్వహించింది. ఇందులో ఎన్‌ఎల్‌సీకి చెందిన స్టేక్ హోల్డర్స్ అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎల్‌సీ సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి మాట్లాడుతూ ఎన్‌ఎల్‌సీ ఇండియా, స్టేట్ డిస్కామ్, ఇతర స్టేక్ హోల్డర్ల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వినియోగదారుల సంతృప్తి తమ కంపెనీ ప్రధాన విలువల్లో ఒకటన్నారు. టీఎన్‌పీడీసీఎల్ సీఎండీ రాజేష్ లఖానీ మాట్లాడుతూ... వినియోగదారుల సంబంధాలను మెరుగుపరిచేందుకు ఎన్‌ఎల్‌సీఐఎల్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఎన్‌ఎల్‌సీ పవర్ స్టేషన్స్ నుంచి విద్యుత్ తీసుకునే వారిలో టీఎన్‌పీడీసీఎల్ అతిపెద్ద కస్టమర్ అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎల్‌సీ ఇండియా డైరెక్టర్ (పవర్) ఎం.వెంకటాచలం, టీఎన్‌పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ మలర్‌విళి, ఎన్‌ఎల్‌సీ ఇండియా డైరెక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఓపెన్ ఇంటరాక్షన్‌లో... ఎన్‌ఎల్‌సీ చేపట్టిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి, ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని డిస్కమ్స్ ప్రతినిధులు కోరారు.

కాకినాడలోని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణను మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు చెబుతున్న తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ వ్యవస్థాపకులు దేవరకొండ రాజు



ఇండో-తైమూర్ మెడికల్ సమ్మిట్‌కు విశేష ఆదరణ

చెన్నై, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇండో-తైమూర్ మెడికల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు విశేష ఆదరణ లభించింది. మంగళవారం నగరంలో జరిగిన ఈ సమ్మిట్‌కు తైమూర్ ఉప ప్రధాని మారియానో అస్సనామి సబినో ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఆ దేశ ఆరోగ్యశాఖ మంత్రి ఎలియా ఏఏ దాస్ రైసా అమరా, తైమూర్ మెడికల్ కాలేజీల ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ విభాగ డైరెక్టర్లు డాక్టర్ రాజా తంగప్పన్, డాక్టర్ ఇస్లిన్ జె.భాస్కర్ తదితరులు హాజరయ్యారు. ఉపప్రధాని సతీమణి క్యాండిడా గ్లెన్సివియారియా జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మారియానో అస్సనామి మాట్లాడుతూ... తైమూర్‌లో భారతీయ ఎంబీబీఎస్ పాఠ్యాంశాలను కూడా అనుసరిస్తున్నందున, భారత విద్యార్థులు తైమూర్‌లో ఎంబీబీఎస్ అధ్యయనాన్ని ఎంచుకోవచ్చని సూచించారు.


సమ్మిట్‌లో ఇరుదేశాల ప్రతినిధులు


చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సింతనైసెల్వన్

వీరాణం చెరువులో 4.38 లక్షల చేపపిల్లల విడుదల

ఐసీఎఫ్, జూలై 23: కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపంలోని వీరాణం చెరువులో జాలర్లు ఉపాధి పొందేలా పలురకాల చేప పిల్లలు వదిలిపెట్టారు. కట్లా, రోగు, మిర్కాల్ సహా పలురకాలకు చెందిన 4.38 లక్షల చేప పిల్లలను కాట్టుమన్నార్‌కోయిల్ ఎమ్మెల్యే సింతనైసెల్వన్, మత్స్యశాఖ అధికారులు, జాలర్ల సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.